క్లుప్తంగా

నేడు ఉచిత వైద్యశిబిరం

పెదకూరపాడు: మండల పరిధిలోని 75 త్యాళ్ళూరు గ్రామంలో ఈ నెల 27న వివేకానంద విద్యా సంస్థలు ఆధ్వర్యంలో అధునాతన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఉదయం 8 గంటలనుంచి వివేకానంద విద్యా నికేతన్ ఆవరణలో శిబిరం ప్రారంభమవుతుందన్నారు. విజయవాడ ఎంజే నాయుడు మల్టీ సూపర్ స్పెషాలిటీ ఫౌండేషన్ చైర్మన్ వావిలా రజనీకాంత్ శర్మ సహకారంతో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో ఎముకలు, కీళ్ల నొప్పులు, కండనరాలకు సంబంధించి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

విశ్వమాత మదర్ థెరిస్సా



పెదకూరపాడు: విశ్వమాత మదర్ థెరిస్సా అని పెదకూరపాడు జెడ్పీ పాఠశాల హెచ్ఎం కెవి రమణ అన్నారు. పెదకూరపాడులోని జెడ్పీ పాఠశాలలో మదర్ థెరిస్సా జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రమణ మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే సిద్ధాంతాన్ని ఆచరించిన మదర్ ప్రజలకు ఏంతో సేవ చేశారని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు నరేష్, రాధాకృష్ణ, కన్యకుమారి, సాంబశివరావు, మర్రెడ్డి, మురళి, రజియా తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో...

సత్తెనపల్లి: మానవత్వానికి మరోపేరు, దీనజనులపాలిట దేవతారూపం విశ్వవిఖ్యాత సంఘ సేవకురాలు మదర్ థెరిస్సా అని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, మంచికంటి వెంకటేశ్వరరావు అన్నారు. మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా పట్టణంలోని హోలీఫ్యామిలీ పాఠశాల సమీపంలోని ఆమెవిగ్రహానికి లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ ఆధ్వర్యంలో శనివారం పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. క్లబ్ కార్యదర్శి వల్లూరి శ్రీనివాసరావు, సీనియర్ సభ్యులు పెద్దింటి వేంకటేశ్వర్లు, కోట వేంకటేశ్వర్లు, కె.రాజశేఖర్, తవిటి భావనారాయణ, తదితరులు ఉన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

నకరికల్లు: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, సాధారణ సమస్యల పరిష్కారం ప్రధాన అంశంగా సమావేశం జరుగుతుందని తెలిపారు. ఎంపీపీ మేచారపు అనురాధ అధ్యక్షతన జరిగే సమావేశానికి జడ్పీటీసి సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరుకావాలని సూచించారు.

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి రాజీవ్‌గాంధీ కూరగాయల మార్కెట్ సమీపంలో వేంచేసి ఉన్న రామాలయం, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిజ శ్రావణ మాస దశమి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని శోభాయమానంగా అలంకరించి గోత్రనామాలతో అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



రాజుపాలెం: మండలంలోని కొత్తబోధనంలో నూతనంగా నిర్మించే రామాలయానికి వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం శంకుస్థాపన చేశారు. మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, సర్పంచ్ పాశం మహాలక్ష్మమ్మ, నవధాన్యాలు చల్లి, కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ ఒట్టి శివారెడ్డి, వేపూరి రామ్‌కుమార్, నీలం వెంకయ్య, సందు ఏడుకొండలు, తలవ వెంకటేశ్వర్లు, కుంభా వెంకయ్య, కుంభా అంజి, కుంభా వెంకటేశ్వరరావు, కుంభా గోపి, ఉల్లిగడ్డల ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

కలకక.. కలవరం

- ఒకరినుంచి మరొకరికి శరవేగంగా వ్యాప్తి చెందుతున్న కళ్ల కలక వ్యాధి
- సత్తెనపల్లి డివిజన్‌లో గత నెలరోజుల నుంచి తీవ్రత
- ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయిస్తున్న రోగులు
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న నేత్ర నిపుణులు
- ప్రభుత్వ వైద్యశాలలో సమృద్ధిగా డ్రాప్స్, మందులు



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

సత్తెనపల్లి: కళ్లకలక వ్యాధితో గత నెల రోజులుగా ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలకు రోగులు క్యూ కడుతున్నారు. సత్తెనపల్లి డివిజన్‌లోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలతో పాటు 10 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మూడు అర్బన్ హెల్త్ సెంటర్‌లు ఉన్నాయి. ఇవిగాక ప్రైవేట్ వైద్యశాలలు ఉన్నాయి. సత్తెనపల్లిలోని ఒక్క ఏరియా వైద్యశాలలో గత నెలరోజుల నుంచి ప్రతిరోజూ 10 నుంచి 15 కేసులు కళ్లకలక చికిత్స కోసం రోగులు వస్తున్నారు. అదేవిధంగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ హెల్త్ సెంటర్లలో రోజుకు నాలుగు నుంచి ఏడుగురు వరకు కళ్లకలక వ్యాధితో చికిత్సకు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ యేడాది వేసవి సుదీర్ఘంగా కొనసాగింది. ఉక్క పోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక్కసారిగా వర్షం కురువడంతో ప్రజలు ఉపశమనం పొందినప్పటికీ ఉక్కపోత వదలలేదు. వాతావరణ మార్పుల మూలంగానే కళ్లకలక విజృంభించిందనే వాదనలేకపోలేదు. ఈ వ్యాధి ఒక వ్యక్తి నుంచి కనీసం ఆరుగురికి వ్యాప్తి చెందుతుందని వైద్యులు చెబుతున్నారు. బాధితులు బాధ్యతగా వ్యవహరిస్తే కళ్ల కలకను అరికట్టడం సులువేనని అంటున్నారు. జనసమూహాల్లో జాగ్రత్తగా ఉండాలని, విద్యాలయాల్లో పిల్లలకు సోకితే తల్లిదండ్రులు విద్యార్థులను పాఠశాల, కళాశాలకు పంపకుండా ఉంచడం మంచిదని చెబుతున్నారు వైద్యులు.

కళ్ల కలక ఎలా వస్తుందంటే..

కళ్లకలక ప్రధానంగా కంజక్టవ అనే కంటి పొరకు బ్యాక్టీరియా, వైరస్ సోకడం ద్వారా (పింక్ ఐ) వస్తుంది. వర్షాకాలం సీజన్‌లో నీటిలో బ్యాక్టీరియా పెరిగినప్పుడు వ్యాపిస్తుంది. కళ్ల కలక మూడు రకాలుగా ఉంటాయి. బ్యాక్టీరియా, వైరస్, అలర్జీ వలన వస్తుంది. మొదట తెల్లగుడ్డుకు వస్తుంది. ఏ మాత్రం అశ్రద్ధ చేసినా నల్లగుడ్డుకు వ్యాప్తి చెందుతుంది. దీని వల్ల వ్యాధి తీవ్రత పెరిగే ప్రమాదం ఉంటుంది. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే కంటి వైద్యుడిని సంప్రదించాలి. నిత్యం గంటకోసారి ఐ డ్రాప్స్ వేసుకోవాలి. ఎక్కువ జలుబుతో బాధపడేవారి నుంచి వ్యాప్తి అధికంగా ఉంటోంది.

లక్షణాలు ఇవీ..

- మొదట కన్ను లోపలి భాగం ఎర్రగా మారుతుంది
- కన్ను, రెప్పలు రెండింటికి వాపు వస్తుంది
- కంటిలో దురదగా, మంటగా అనిపిస్తుంది
- కంటి నుంచి అదే పనిగా నీరు కారుతుంది
- ఫుసులు కట్టడం, తెరవలేనంతగా కన్ను మూసుకుపోతుంది.
- గుచ్చుకున్నట్లు కంటి నొప్పి అధికంగా ఉంటుంది.

నివారణ ఇలా..

- కోవిడ్ తరహాలో ఐసోలేషన్, భౌతికదూరంతో ఈవ్యాధి వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చు
- కళ్లకలక వచ్చిన కళ్లను నేరుగా చేతితో తాకడం, నలపడం చేయరాదు
- తడివస్త్రం లేదా దూదితో కళ్లను శుభ్రం చేసుకోవాలి
- కళ్లకలక వచ్చిన వ్యక్తికి డ్రాప్స్ వేసిన తర్వాత చేతులను శుభ్రపర్చుకోవాలి. అదే చేతులతో కళ్లను తాకినా వేరే వ్యక్తులకు ఈ వైరస్ సోకుతుంది
- వైరస్ సోకిన వ్యక్తి కళ్లలోకి చూడడం ద్వారా వ్యాప్తి చెందదు
- రోజుకు కనీసం ఆరుసార్లు గోరువెచ్చని సబ్బు నీటితో కళ్లు శుభ్రం చేసుకోవాలి
- సబ్బు, రసాయనాలు కంటి లోపలికి వెళ్లకుండా జాగ్రత్త పడాలి
- బాధితులు వాడే దుప్పట్లు, దిండ్లు, తువాళ్లు, రుమాళ్లు, సబ్బులను మరెవ్వరూ వాడరాదు
- తప్పని పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తప్పకుండా కళ్లను పూర్తిగా కప్పి ఉంచే కళ్ల అద్దాలను ధరించాలి
- కంటి వైద్య నిపుణులను సంప్రదించి కళ్లకలకను బట్టి తగిన మందులు వేసుకోవాలి.

సొంత వైద్యం వద్దు..



కళ్లకలక వ్యాధి వచ్చినప్పుడు సొంతంగా వైద్యం చేసుకోవద్దు. కళ్లు దురద వచ్చిందంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఏవేవో మందులు, డ్రాపులు వాడి ఎంతో సూక్ష్మంగా ఉన్న కళ్లను పోగొట్టుకోవద్దు. కళ్లల్లో కళ్లు పెట్టి చూస్తే ఈ వ్యాధి వ్యాప్తి చెందదు. ఎంతో సూక్ష్మంగా ఉన్న కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలి. ప్రభుత్వ వైద్యశాలలో కళ్లకలకకు సంబంధించిన డ్రాపులు, మందులు ఉన్నాయి. గత నెలలో ప్రతి రోజూ పది నుంచి 15 మంది వరకు చికిత్స కోసం వచ్చేవారు. ప్రస్తుతం నాలుగు నుంచి ఆరుగురు వస్తున్నారు.

– డాక్టర్ సజ్జా అరుణకుమారి, ప్రభుత్వ ఏరియా వైద్యశాల కంటి వైద్య నిపుణురాలు

జగనన్న పాలవెల్లువ పశుపోషకులకు వరం

అచ్చంపేట: జగనన్న పాలవెల్లువలో భాగంగా అమూల్ పాల ఉత్పత్తిదారులకు సహకార బ్యాంకుల ద్వారా మేలుజాతి గేదెలను కొనుగోలు చేసుకునేందుకు రూ.లక్ష నుంచి రూ.1.60లక్షల వరకు ఎలాంటి గ్యారెంటీ లేకుండా రుణాలు ఇప్పించడం జరుగుతుందని ఎంపీడీఓ పి.శివసుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ క్రాంతిపథం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు, గ్రామసమైఖ్య సహాయకులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాల ఉత్పత్తిదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం గ్రామగ్రామాన అమూల్ డైరీలను ఏర్పాటు చేస్తోందన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం షేక్ సలీం మాట్లాడుతూ మండలంలో 850మంది అమూల్ డైరీలకు పాలు పోసే రైతులున్నారని చెప్పారు. వీరిని ప్రోత్సహించేందుకు మేలు జాతీ గేదెలను కొనుగోలు చేసుకునేందుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా ఎలాంటి హామీలులేకుండా అతి తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పించడం జరుగుతుందన్నారు. ఈ రుణాన్ని తిరిగి యేడాదిన్నర కాలంలో చెల్లించవలసి ఉంటుందన్నారు. రైతులు ఉత్పత్తి చేసిన పాలను గిట్టుబాటు ధర్పై అమూల్ డైరీల ద్వారా కొనుగోలు చేసే వెసులుబాటు కల్పిస్తున్నట్లు చెప్పారు. దీనిపై పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సమైఖ్య సహాయకులు గ్రామాలలో పాలఉత్పత్తిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. పశువైద్యాధికారి డాక్టర్ స్వాతి, ఈఓపీఆర్డీ వీరాస్వామి పాల్గొన్నారు.

క్రోసూరులో...

క్రోసూరు: అమూల్ పాలకేంద్రాలకు పాలు పోసే పాడిరైతులకు గేదెలు కొనుగోలు చేసేందుకు బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీకి ఋణాలు అందిస్తున్నట్లు ఎంపీడీవో బి.మహేష్ తెలిపారు. శనివారం క్రోసూరు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో పాడిరైతులకు, వలంటీర్లకు, సెక్రటరీలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంపీడీవో, వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు, మండల పశువైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అమూల్ పాలకేంద్రాలలో పాలు పోసే పాడిరైతులకు పాల వెన్నశాతం అధికంగా వస్తే అధికధర చెల్లించటం జరుగుతుందన్నారు. అదే విధంగా పాడిపోషణపై ఆధారపడి జీవించే రైతుల చేయూతనిచ్చేందుకు పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పాడి గేదెలు కొనుగోలు చేసుకునేందుకు కోఆపరేటివ్ సెంట్రల్‌బ్యాంకు ద్వారా రూ.లక్ష నుంచి లక్షన్నర దాక ఋణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెల 15 లోపు అందరికీ రుణాలు అందించటం జరుగుతుందన్నారు. ఏపీఎం సలీం, మండల పశువైద్యులు డాక్టర్ మల్లయ్య, పంచాయతీ విస్తరణ అధికారి పి.శివరామయ్య, సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎంపీ చొరవతో రోడ్డు నిర్మాణం



తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు సహకారంతో తొండపిలోని పొలాలకు వెళ్లే రహదారుల నిర్మాణాలు చేపట్టారు. రోడ్డు ఏర్పాటుకు గాను రైతుల అభ్యర్థన మేరకు పొక్లెయిన్‌ను సమకూర్చారు. సుమారు 10 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించుకున్నారు. వర్షాకాలంలో రహదారి గుండా పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు దృష్టికి తీసుకెళ్లగా వారి సమస్యలను గుర్తించి రహదారి నిర్మాణాలకు తోడ్పాటు అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బి.కాటయ్య, జానీబాషా, అబ్రహం, రషీద్, పలువురు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ యువగర్జన సభకు తరలిరండి

అచ్చంపేట: బీసీలందరిని ఐక్యతతో ఉంచేందుకు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27న క్రోసూరులో నిర్వహించే బీసీ యువ గర్జన సభకు వేలాదిగా బీసీ సోదరులు తరలిరావాలని సంఘం పెదకూరపాడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పడకండ్ల లక్ష్మాచారి పిలుపునిచ్చారు. శనివారం ఆయన అచ్చంపేటలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు తగిన ప్రాధాన్యం లేదన్నారు. పార్టీలకు అతీతంగా బీసీలంతా ఐక్యతతో పోరాటాలకు సిద్ధపడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ సందర్భంగా జరిగే సభకు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కేశన శంకరరావు, యూత్ అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్ హాజరవుతారని చెప్పారు.

ఈవ్‌టీజింగ్ చట్టరీత్యా నేరం

మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి తౌషిద్ హుస్సేన్



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి తౌషిద్ హుస్సేన్

సత్తెనపల్లి: ఈవ్‌టీజింగ్ చేయటం చట్టరీత్యా నేరం అని, ర్యాగింగ్ రహిత సమాజం కోసం ప్రతి విద్యార్థి నడుం బిగించాలని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి తౌషిద్‌హుస్సేన్ అన్నారు.సత్తెనపల్లి మండల న్యాయసేవాధికర కమిటీ అధ్వర్యంలో పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర బాలకుటీర్, శ్రీ వాసవి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి తౌషిద్ హుస్సేన్ మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్‌కు పాల్పడటం చట్టరీత్యా నేరం అని, బాధిత విద్యార్థినులు ఎవరైనా ఉంటే నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. విద్యార్థులు ఎవరైనా సరే ర్యాగింగ్‌కు పాల్పడి వారి యొక్క ఉజ్వల భవిష్యత్తు పాడు చేసుకో వద్దని హితవు పలికారు. మండల న్యాయ సేవాధికర కమిటీ అందించే పలు సేవలను గురించి తెలియజేశారు. ప్రభుత్వ న్యాయవాది షేక్ బాలిసైదా, సీనియర్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, ప్యానల్ న్యాయవాది బి.లక్ష్మీ కోటేశ్వరరావు, లీగల్ సర్వీసెస్ సభ్యులు డా.వెలుగూరి సుబ్బారాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు, బాలకుటీర్ హెచ్ఎం గీతాంజలి, పారా లీగల్ వలంటీర్ షేక్ ఖాజావలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై ఆర్బీకే సిబ్బందికి శిక్షణ

వినుకొండ(నూజెండ్ల): పంట కోత ప్రయోగాలపై నూజెండ్ల రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారిణి షేక్ సుగుణాబేగం ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఆర్బీకే పరిధిలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకం కింద పంట కోత ప్రయోగాలు చేపట్టాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో వరి పంటను గ్రామ యూనిట్‌గా ఎంపిక చేసి పంట కోత ప్రయోగాలు చేపట్టడం జరిగిందన్నారు. పంట కోత ప్రయోగాల్లో వచ్చిన దిగుబడి ఆధారంగా బీమా పథకం అమలు పరచడం జరుగుతుందన్నారు. ఈ ప్రయోగాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటుందని హెచ్చరించారు. అనంతరం ఇన్‌చార్జి సహాయ గణాంక అధికారి (ఏఎస్‌వో) కె. నాగశ్రీనివాసరావు మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలు చేయడానికి ప్లాట్ ఎంపిక, సర్వే, సబ్ డివిజన్ నంబరు ఎలా ఎంపిక చేయాలి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. పంట కోత ప్రయోగాలకు సంబంధించిన ఫారం -1, 2 నిర్ణీత సమయంలోనే జిల్లా కార్యాలయానికి పంపాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో ఎల్.ఎలీషా, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

చిలకలూరిపేటటౌన్: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. అర్బన్ ఎస్ఐ మోహన్ కథనం ప్రకారం పట్టణంలోని వైఎస్సార్ కాలనీ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు అనుమానస్పందంగా కనిపించిన బొలేరో వాహనంలో రేషన్ బియ్యం నిల్వ ఉంది. 65 బస్తాల్లో రేషన్ బియ్యం నరసరావుపేటకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది.

నాణ్యమైన విద్య అందించాలి



నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించటంతో పాటు ప్రతి విద్యార్థికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రామమోహన్ తెలిపారు. పెదచెరువులోని శ్రీజవహర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను శనివారం కమిషనర్ రామమోహన్ ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం క్రింద విద్యార్థులకు అందించే జగనన్న గోరుముద్ద నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో కలసి భోజనం స్వీకరించారు. గుడ్లు నాణ్యతను పరిశీలించి నాణ్యతలేని వాటిని తిరిగి పంపాలని తెలిపారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు గోరుముద్ద అందుతున్నదీ, లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతతో కూడిన తాజా పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందివ్వాలని తెలిపారు. గోరుముద్దలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజలను రెచ్చగొట్టేవారిపై చర్యలు తీసుకోండి

చంద్రబాబు, నారా లోకేష్, అచ్చెంనాయుడులపై పోలీసులకు ఫిర్యాదు



అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు

అచ్చంపేట: ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో విద్వేషాలు నింపే ప్రసంగాలు చేస్తూ ప్రజలలో అలజడి రేపుతున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చం నాయుడులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్ సీపీ పెదకూరపాడు నియోజకవర్గ సోషల్ మీడియా ప్రతినిధులు శుక్రవారం రాత్రి అచ్చంపేట ఎస్ఐ సీహెచ్ మణికృష్ణకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఎక్కువ కేసులున్నవారికి నామినేటెడ్ పదవులు ఇస్తామంటూ లోకేష్ కార్యకర్తలను రెచ్చగొడుతున్నారని, దానిమూలంగా గ్రామాలలో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోతూ అలజడి సృష్టిస్తున్నారని, శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తున్నారన్నారు. ఇలాంటి ప్రసంగాలవల్ల తంబళ్లపల్లి, పుంగనూరు, మాచర్ల వంటి సమస్యాత్మక గ్రామాలలో అలజడులు జరుగుతున్నాయని, అవి రాష్ట్రం మొత్తం వ్యాప్తి చెందకముందే చర్యలు చేపట్టాలని కోరారు. ఫిర్యాదు చేసినవారిలో సోషల్ మీడియా ప్రతినిధులు వి.నాగరాజు, జి.కుమార్, సలీమ్, బాలకోటి, బాషా తదితరులున్నారు.

ఉత్తమ యార్డుగా తీర్చిదిద్దుతాం

క్రోసూరు మార్కెట్‌యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి

క్రోసూరు: క్రోసూరు మార్కెట్‌ను ఉత్తమ మార్కెట్ యార్డుగా తీర్చిదిద్దుతామని మార్కెట్‌యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి అన్నారు. శనివారం మార్కెట్ యార్డులో జరిగిన సర్వసభ్య సమావేశానికి యార్డు కార్యదర్శి వి.శ్రీదేవి అధ్యక్షత వహించగా చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నంబూరుశంకరరావు సహయ సహకారంతో యార్డులో త్వరలో కోల్డ్‌స్టోరేజీ నిర్మాణాలకు అనుమతులు తీసుకొస్తామన్నారు. మండలంలోని 88త్యాళ్లూరు వైపు నుంచి వ్యవసాయ ఉత్పత్తులు పీసపాడు మీదుగా వెళ్తుంటాయని, అందుకని పీసపాడు వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా మాదిపాడు వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేయటంపై తగు విధంగా చర్యలు తీసుకొంటామన్నారు. అదేవిధంగా యార్డులో అన్ని సౌకర్యాలతో కూడిన గదులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా వ్యవసాయ మార్కెట్లోని రైతుల విశ్రాంతి భవనానికి పూర్తి సౌకర్యాలు ఏర్పాటు చేసి అందరికీ ఉపయోగపడేలా రీమోడలింగ్ చేయనున్నట్లు తెలిపారు. పాలక వర్గ సభ్యుల ఆధ్వర్యంలో లింకు రోడ్లు నిర్మించేందుకు తగు నిధులు కల్పించేలా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దృష్టికి, మార్కెట్‌యార్డు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. యార్డు సూపర్‌వైజర్ శివశంకరరెడ్డి మాట్లాడారు. ముందుగా యార్డులో నూతనంగా బాధ్యతలు తీసుకున్న ప్రత్యేకశ్రేణి కార్యదర్శి వి.శ్రీదేవిని సభలో పరిచయం చేశారు. యార్డు వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, పాలకవర్గ సభ్యులు సాతులూరి రాజు, షేక్ ఫాతిమూన్, మేకల శ్రీనివాసరావు, బాణావత్ శ్రీరాములు నాయక్, తమ్మిసెట్టి కృష్ణమూరి, షేక్ హలీబీ, ఏకుల చిన్నకోటమ్మ, చిరుమామిళ్ల నరసింహారావు, బొడ్డుపల్లిరాము పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



పట్టణంలోని 19వ వార్డులో మొక్కలు నాటుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: జీవకోటికి ప్రాణవాయువును అందించే మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని 19వ వార్డు కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వార్డులోని ప్రాథమిక పాఠశాల, స్మశాన వాటికలలో శనివారం చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ కేవలం మొక్కలు నాటడం, ఫొటోలు దిగడం వరకే పరిమితం కాకుండా నాటిన మొక్కలు బతికేలా పర్యవేక్షణ చేయాలన్నారు. నాటిన మొక్కల్లో ఏవైనా చనిపోతే మళ్లీ నాటి అవి ఏపుగా పెరిగేలా సంరక్షణ చేయాలని సూచించారు. మొక్కల వల్లన వచ్చే పర్యావరణంలో ఎంతో ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. అనంతరం మంత్రి అంబటి పలు మొక్కలు నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్ షేక్ మౌలాలి (సహరా), పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు యాసారపు బాబు, ఎస్సీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, కూకుట్ల శ్రీనివాసరావు, తాళ్ళూరు మోహన్‌బాబు, సెగ్గెం వెంకటేశ్వరరావు, శిరిగిరి వెంకట్రావు, దాసరి తిరుపతిరావు, పలు వార్డుల కౌన్సిలర్లు, నాయకులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల బాధ్యులు పాల్గొన్నారు.

అత్తలూరుపాలెం ఆర్గానిక్ ఎఫ్‌పీఓకు జైవిక్ ఇండియా అవార్డు



గుంటూరులోని అత్తలూరు ఆర్గానిక్స్ ఉత్పత్తుల స్టోర్, రెస్టారెంట్

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాయంతో మండల పరిధిలోని అత్తలూరుకు చెందిన అత్తలూరుపాలెం ఆర్గానిక్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (ఎఫ్‌పీఓ)కు ఇంటర్నేషనల్ కాంపిటెన్స్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అగ్రికల్చర్ సంస్థ ప్రతిష్టాత్మక జైవిక్ ఇండియా అవార్డును శనివారం ప్రకటించింది. జాతీయ స్థాయిలో మొత్తం పది విభాగాల్లో 51 అవార్డులను వెల్లడించగా ఇందులో మన రాష్ట్రానికి మూడు అవార్డులు దక్కగా రైతు ఉత్పత్తిదారుల సంఘం కేటగిరిలో అత్తలూరుపాలెం ఆర్గానిక్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌కు దక్కడం విశేషం. ఈసందర్భంగా ఆర్గానిక్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరక్టర్ నూతలపాటి సురేంద్రబాబు మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్న రైతులకు ఈ అవార్డు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు.

నాటుసారా స్వాధీనం

అచ్చంపేట: నాటుసారా తయారు చేసి, విక్రయానికి తరలిస్తుండగా వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుండిచి 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు అచ్చంపేట ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ శనివారం తెలిపారు. మండలంలోని తాడువాయి అడవులలో నాటుసారా బట్టీ ఏర్పాటుచేసి సారా తయారు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు శనివారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. సారా బట్టీ నుంచి సాటు సారాని తరలించేందుకు సిద్ధంగా ఉన్న భూక్యా హనుమంతూనాయక్‌ను అదుపులోకి తీసుకుని అతని నుంచి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. సారీ బట్టీని ధ్వంసం చేసినట్లు చెప్పారు. హనుమంతునాయక్‌పై కేసు నమోదు చేసి సత్తెనపల్లి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు పంపామన్నారు. నాటు సారా తయారు చేయడం, అమ్మడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారు ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని ఎస్ఐ హెచ్చరించారు.

యువకుడి మృతిపై కేసు

నాదెండ్ల: ద్విచక్రవాహనం అదుపుతప్పిన ప్రమాదంలో ఒడిషా యువకుడు మృతి చెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఒడిషా రాష్ట్రానికి చెందిన కనహైదాస్ (35) అనే కార్మికుడు సీఆర్ కళాశాల ఎదురుగా ఉన్న పాత ఇనుము దుకాణంలో కూలీగా పనిచేస్తుంటాడు. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో సినిమాహాలు రోడ్డులో తన ద్విచక్రవాహనాన్ని అతివేగంగా నడుపుతూ సడన్ బ్రేక్ వేయటంతో వాహనం అదుపుతప్పి ఎదురుగా ఉన్న రమ్య స్పిన్నింగ్ ప్రహరీను ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సుమారు రెండు నెలల క్రితమే మృతి చెందినట్లు సమాచారం. మృతుడికి ఇరువురు సంతానం కాగా ప్రస్తుతం వీరు ఒడిషాలోని స్వగ్రామంలోనే ఉంటున్నారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.